## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 3 గంటలకు నాలుగో సచివాలయం పరిధిలోని ఐనముక్కలలో నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఐనముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు, అధికారులు పాల్గొనాలని ఆయన పిలుపు ఇచ్చారు.

### ఆయాల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ

పొదిలి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీఓ సుధామారుతి తెలిపారు. కొనకమిట్ల మండలం చినారికట్ల ఓసీ(బీసీ-ఏ), పొదిలి నగర పంచాయతీ పరిధిలోని హరికృష్ణ హాల్ సెంటర్(బీసీ-బి), పొదిలి మండలంలోని ఉప్పలపాడు-2(ఎస్టీ) సెంటర్లలో ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా గ్రామానికి చెందిన వివాహిత అయి, ఏడో తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్లలోపు ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ సూచించారు.

### నేడు సర్వసభ్య సమావేశం

దొనకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

గిద్దలూరు రూరల్: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గిద్దలూరు నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గుర్తించి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నారాయణ, రాజు పాల్గొన్నారు.

### బాలసంజీవని కిట్లు పంపిణీ

కొనకనమిట్ల: మండలంలోని నాగిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు మంగళవారం బాలసంజీవని కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మందా తిరుపతమ్మ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాహారం అందజేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రాగిపిండి, జొన్న పిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరాలు సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

### వలంటరీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బేస్తవారిపేట-2, చెట్టిచర్ల సచివాలయ పరిధిలోని రెండు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు చేశారు. ఈ నెల 19న నియామక పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్ ఉన్నారు.

### తోడికోడళ్ల గొడవ.. సెల్ టవర్ ఎక్కి మహిళ ఆందోళన



సెల్ టవర్ పైనుంచి కిందకు దిగి వస్తున్న లక్ష్మీబాయి

కంభం: తోడి కోడళ్ల మధ్య పంచాయితీ.. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల వరకు వెళ్లింది. ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలతో వారిలో ఒక మహిళ ఏకంగా సెల్ టవర్ ఎక్కి న్యాయం చేయాలని నిరసన తెలిపింది. ఈ సంఘటన మంగళవారం కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. అర్ధవీడు మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన లక్ష్మీబాయికి ఆమె తోడి కోడలికి మూడు రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో లక్ష్మీబాయి అర్ధవీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఆమె తోడి కోడలు స్వగ్రామమైన పెద్దారవీడులో పోలీసులను ఆశ్రయించింది. పెద్దారవీడు పోలీసులు లక్ష్మీభాయిని స్టేషనుకు పిలవడంతో మంగళవారం కంభం వచ్చిన ఆమె.. అర్ధవీడు రోడ్డులోని సెల్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయాలని నిరసన తెలిపింది. స్థానిక సీఐ ఎం.రాజేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలికి నచ్చజెప్పి కిందకు దించారు.

# సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం పొదిలి మండలం మల్లవరం సచివాలయం పరిధిలోని మల్లవరం, కొస్టాలపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు స్థానిక నాయకులు దొందేటి చెంచిరెడ్డి, కొమ్మసాని చిన్నరోశిరెడ్డి, కొమ్మసాని పెద్ద రోశిరెడ్డి, దొందేటి పెద్ద వెంకటేశ్వరరెడ్డి, దొందేటి చిన్న వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా ఇస్తున్నారా అని మహిళలను ప్రశ్నించగా అన్నీ అందుతున్నాయని సంతోషంగా చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి ఏ మేర లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే వివరించి బుక్‌లెట్లు అందజేశారు. సిమెంట్ రోడ్డు, సైడు కాలువలు నిర్మించడంతోపాటు విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక గిట్టని వారు అవాస్తవాలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నరని.. అలాంటి వారికి జగనన్న సంక్షేమ పథకాలే సమాధానం చెబుతాయన్నారు. 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలుపొందేలా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కె.రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శ్రీకాంత్, ఏపీఎం మాణిక్యారావు, మండల పార్టీ అధక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రెడ్డెబోయిన సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ యర్రమూడి వెంకటేశ్వర్లు, ముల్లా జాకీర్, రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు, అంబవరపు నారాయణరెడ్డి, రబ్బానీ, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

● గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తురిమెళ్లలో ఆయన పర్యటించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రజలు చెప్పిన సమస్యలు నమోదు చేసుకొని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అర్హత ఒక్కటే ప్రామాణికం చేసుకొని ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందడం కోసం ప్రజలు నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. నాయకుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. సర్పంచ్ సుభద్ర, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు యేలం వెంకటేశ్వర్లు, నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, చిన్నకంభం సర్పంచ్ రసూల్, వరి కుంట్ల పెద్దకోటేశ్వరరావు, సుబ్బారావు, యేలం శివ, గోగులదిన్నె వెంగళరెడ్డి, అంగారపు కృష్ణ, జాకీర్, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడులు



దొనకొండ: మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి



దర్శి: పట్టలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి: పంట మార్పిడి అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సహపరిశోధనా సంచాలకులు డాక్టర్ జీఎమ్‌వీ ప్రసాదరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐకార్ 95వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సాంకేతిక వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంది ఎల్ఆర్‌జీ 105 విత్తనాలు, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. జీఎమ్‌వీ ప్రసాద్‌రావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం. ఉష, డాక్టర్ ఎం. శివ, డాక్టర్ టీవీ రెడ్డి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ లీలాకృష్ణ, టి. మానస పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో మిరప పంట సాగుపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జెస్సీ గ్లోరీ, సుధారాణి, గ్రామ రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

మార్కాపురం: డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే కేపీని కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు అందేలా చూడాల్సిన బాధ్యత డీఆర్‌డీఏపై ఉందన్నారు. ఆయన వెంట వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్ ఉన్నారు.

# నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

● జగనన్న సురక్షకు హాజరు కానున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ప్రారంభానికి సిద్ధమైన అగ్రి టెస్టింగ్ ల్యాబ్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం యర్రగొండపాలెంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ 66.13 లక్షల ఖర్చుతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-3, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో గ్రామ సచివాలయాలు-1, 2 పరిధిలోని ప్రజలకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజలకు అవసరమైన పత్రాలు అందజేస్తారని ఆయన వివరించారు.

### కుష్టు వ్యాధి నిర్మూలనకు చర్యలు

ముండ్లమూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్టు కుష్టువ్యాధి నిర్మూలన జిల్లా మెడికల్ ఆఫీసర్ రజితమానస అన్నారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న కుష్టు వ్యాధి నిర్మూలన వారోత్సవాలను మంగళవారం పరిశీలించారు. లెప్రసీ పారా మెడికల్ ఆఫీసర్ సూరిబాబు, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, మధుశంకర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థినులు

మార్కాపురం టౌన్: తాము పాఠశాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని బోడపాడు గ్రామ విద్యార్థులు మంగళవారం సబ్‌కలెక్టర్ సేథుమాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 40 మంది విద్యార్థినులు మార్కాపురంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదువుకుంటున్నామని, పాస్‌లు ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల్లో వెళ్తూ ఇబ్బంది పడాల్సి వస్తోందని వివరించారు. బస్సు ఏర్పాటు చేస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని సబ్ కలెక్టర్‌ను కోరగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# ఓటరు లిస్టులో మార్పులను గమనించాలి

● బీఎల్‌ఓల అవగాహన సదస్సులో సబ్‌కలెక్టర్ సేథు మాధవన్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

మార్కాపురం టౌన్: నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని బూత్ లెవెల్ అధికారులను సబ్‌కలెక్టర్ సేథుమాధవన్ ఆదేశించారు. పట్టణంలోని సౌజన్య కళ్యాణ మండపంలో మంగళవారం మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటరు లిస్టులో తొలగించాలని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి బీఎల్‌ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరు ఇంటిని పరిశీలించి కొత్త ఓట్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఆయా కుటుంబాల్లో వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించాలన్నారు. అడ్రస్‌లో తప్పులు ఉంటే సవరించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో చేర్పులు, మార్పులు తదితర వివరాలను సంబంధిత మండల స్థాయి అధికారులకు సూచించాలన్నారు. ఈ ప్రక్రియను ఆగస్టు 21వ తేదీ వరకు చేపట్టి ఓటర్ల జాబితాను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, వరకుమార్, డీటీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### పంట నమోదుకు రైతులు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: పంట నమోదు కార్యక్రమానికి రైతులు సహకరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని తంబళ్లపల్లె గ్రామంలో మంగళవారం రైతులకు ఈ-క్రాప్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలోని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రైతు వారి పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. వేసవిలో లోతైన దుక్కిలు వేసుకుంటే అనేక లాభాలున్నాయన్నారు. మట్టి నమూనా సేకరణతో రైతులు ఎటువంటి పంటలు వేయాలనే విషయం పూర్తిగా తెలుస్తుందన్నారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పత్తిలో పసుపు అట్టలు పెట్టాలి

బేస్తవారిపేట: పత్తి, మిరప పంటల్లో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలం రంగు అట్టలు ఎకరా పొలంలో 20 పెట్టాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, పూసలపాడులో మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు డీఆర్‌సీ ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లోతైన దుక్కులు దున్నడంతో శిలీంధ్ర అవశేషాలను నాశనం చేయవచ్చని, పత్తి పంట నాటిన 45–75 రోజుల్లో లీటర్ నీటికి మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారి శైలజ, ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత, ఏపీఎం కె.రఘునాథ్‌బాబు, ఏఈఓలు ఆదిగణేష్ పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ

కొమరోలు: మండలంలోని బ్రాహ్మణపల్లె ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి బి.వెంకటరత్నం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించిన ఎంఈవో.. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ఎంఈవో వెంకటరత్నం మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

### నలుగురు జూదరుల అరెస్టు

కంభం: నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని జంగంగుంట్ల పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో కలిసి దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3610 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### దుకాణాలపై అధికారుల దాడులు

త్రిపురాంతకం: తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం పలు దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు. మూడు దుకాణాలపై కేసులు నమోదు చేసి ఫైన్ వేసినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ మోటార్లు, ఎలక్ట్రికల్, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. దాడుల్లో షేక్ రియాజ్, ఎస్‌కే మోసిన్ పాల్గొన్నారు.

### ప్రతి ఇంటినీ సర్వే చేయాలి



మాట్లాడుతున్న లోకేశ్వరరావు

దర్శి: ప్రతి అధికారి ఇంటింటినీ సర్వే చేయడంలో భాగంగా ప్రతి ఓటరును కలిసి వివరాలు సేకరించాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి యమ్‌వీయస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక శ్రీ శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లు, సూపర్‌వైజర్‌లు, 282 పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన బూత్ లెవల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. లోకేశ్వరరావు మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో డోర్ నంబర్‌లు నమోదు చేసేందుకు సహకరించాలని కోరారు. 100 సంవత్సరాల పైబడిన వారు , ఒకే డోర్ నంబరులో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు, తప్పుగా నమోదు అయిన డోర్ నంబర్‌లు సరిచేసే విధానం పై వివరించారు. దర్శి, కురిచేడు, ముండ్లమూరు, దొనకొండ తహసీల్దార్లు కె. వెంకటేశ్వర్లు, జ్వాలా నరసింహం, నయీమ్ అహమద్, సువర్ణ పాల్గొన్నారు.

# తపాలా బీమా పేదలకు వరం



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

మార్కాపురం: గ్రామీణ ప్రజలకు తపాలా బీమా ఒక వరం లాంటిదని మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గ్రామీణ తపాలా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తపాలాశాఖ నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది అధిగమించాలని కోరారు. సిబ్బంది సమష్టి కృషితో పనిచేసి ఈ ఏడాది తపాలా జీవిత బీమా ప్రీమియం వసూళ్లలో సర్కిల్ స్థాయిలో మార్కాపురాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. అధిక సంఖ్యలో ప్రజలు ఖాతాలను తెరిచే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాల నిధులను ఈ ఖాతాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా అందించవచ్చని తెలిపారు. ప్రజలతో మమేకమై సేవలను చేరువచేయాలని, పదేళ్లలోపు బాలికలతో సుకన్య సంవృద్ధి యోజన ఖాతాలు తెరిపించాలన్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్‌లో డిపాజిట్లపై మహిళలకు అధిక వడ్డీ లభిస్తుందనే విషయమై అవగాహన కలిపించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మహమ్మద్ అలీ, సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శరత్‌బాబు, మార్కాపురం హెడ్‌పోస్టు మాస్టర్ సుబానీ, సిబ్బంది ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ-2, హెచ్‌ఎం, సహోద్యోగులు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఎంఈఓ-2 అచ్యుత సుబ్బారావు, హెచ్‌ఎం సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమంగా తీర్చిదిద్దడమేకాక పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేశారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, రమేష్, కోటేశ్వరరావు, రవీంద్రబాబు, కోటి మోహన్, సరిత, గోపాల కృష్ణమూర్తిని తోటి ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయం లక్ష్యం

ముండ్లమూరు: గ్రామీణ ప్రాంత రైతులకు మేలు చేసేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవహరించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఎన్ఎఫ్ఏ మహేశ్వర రెడ్డి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

### జెరాక్స్ యంత్రం బహూకరణ

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలకు చిన ఉల్లగల్లుకు చెందిన రెడ్డదిన్నె చిన్నికృష్ణయ్య జెరాక్స్ యంత్రాన్ని మంగళవారం బహూకరించారు. ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాలకు అనేక వసతులు సమకూర్చామన్నారు.